ఫంక్షన్ హాల్ నిర్మాణానికి స్థలం పరిశీలన

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి గ్రామంలో ఉన్న హనుమాన్ దేవాలయం అభివృద్ధి పనులలో భాగంగా 25.5 లక్షలతో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ నిర్మాణానికి శుక్రవారం కాలనీ ప్రజలు, కాంట్రాక్టర్‌తో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి స్థలాన్ని పరిశీలించడం జరిగింది. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. 2 రోజులలో పనులు ప్రారంభించాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. కాలనీలో ఫంక్షన్ హాల్ నిర్మించడం ద్వారా పేద ప్రజలు, మధ్యతరగతి వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఫంక్షన్ హాల్ నిర్మాణానికి కృషి చేసిన కార్పొరేటర్‌కు బలరామక్రిష్ణ భక్త భజన మండలి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కెం క్రిష్ణయాదవ్, కాశమోని అనిల్, రావుల భాస్కర్, నోముల ప్రకాష్‌యాదవ్, రాజేష్ గౌడ్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా నేతలను అడ్డుకున్న పోలీసులు



మణికొండ: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీష్ రావును పరామర్శించేందుకు ఆయన ఇంటికి వచ్చిన మహిళా నాయకులను నార్సింగి పోలీసులు అడ్డుకున్నారు. గురువారం నగరంలో జరిగిన ఆందోళనలతో హరీష్‌రావును పోలీసులు అరెస్టు చేసి రాత్రికి విడుదల చేసిన విషయం తెలిసిందే. అరెస్టు చేస్తున్న క్రమంలో అతని భుజానికి గాయం కావటంతో ఆయనను పరామర్శించేందుకు శుక్రవారం మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలోని క్రిన్స్ విల్లాల గేటెడ్ కమ్యూనిటీ వద్దకు మాజీ మంత్రి సునితారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు మాలోతు కవితలు వచ్చారు. అప్పటికే హరీష్‌రావును హౌస్ అరెస్టు చేయటంతో వారిని లోనికి అనుమతించలేదు. దీంతో వారు గేటెడ్ కమ్యూనిటీ గేట్ ముందే ధర్నాకు దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారిని అరెస్టు చేసి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించి కొద్ది సేపటి తరువాత వదిలిపెట్టారు.

'అమ్మ పేరుతో' ఒక చెట్టు



ఏజీవర్సిటీ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఉద్యాన కళాశాల, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్తంగా 75వ వనమహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'అమ్మ పేరుతో ఒక చెట్టు' ను నాటారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అసోసియోట్ డీన్ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యానికి, సకాలంలో వర్షాలు రావటానికి, గ్లోబల్ వార్మింగ్ అరికట్టడానికి విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి ఒక్కరు మొక్కలు పుట్టినరోజులకు, ఇతర సందర్భాలలో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలను నిర్వహించాలని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లో వాయుకాలుష్యాన్ని తగ్గించాలని పర్యావరణ రక్షణకై మొక్కలను నాటాలని తెలిపారు. విద్యార్థులు మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, అసిస్టెంట్ ప్రొఫెసర్ అశ్వన్‌కుమార్, డాక్టర్ మజ్జిగ శ్రీనివాస్, రాజేంద్రనగర్ సర్కిల్ మేనేజర్ వేల్పేల అశోక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నవరాత్రులు



అలకాపూర్ ఎంజీ పార్కులో నృత్యాలు చేస్తున్న చిన్నారులు



వట్టినాగులపల్లి అంబేద్కర్ యూత్ గణేష్ పూజలో సభ్యులు



ఓయూ కాలనీ వినాయకుని వద్ద పూజలు చేసిన భక్తులు



అలకాపూర్ టౌన్‌షిప్ గణపతి పూజలో మహిళలు



నార్సింగి గణపతి పూజలో నాయకులు

మణికొండ: వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. 7వ రోజు శుక్రవారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని అన్ని వార్డులలో నెలకొల్పిన వినాయక మండపాలలో ప్రత్యేక పూజలు, అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పోటాపోటీగా సిద్ధం చేసిన మండపాల వద్ద అటు పూజలతో పాటు ఇటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో పలు రంగాలలో ప్రావీణ్యం ఉన్న వారు తమ ప్రదర్శనలను ఇచ్చి మెప్పు పొందుతున్నారు. పూజలు, అన్నదానాలలో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కౌన్సిలర్లు, ఆయా అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ, కాలనీలు, దేవాలయాల సంఘాల నిర్వాహకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బస్తీలు, కాలనీల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు భక్తులు పూజలు నిర్వహించారు. కిస్మత్‌పూర్ శ్రీకృష్ణ కాలనీలో నిర్వహించిన గణపతికి నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అలకాపూర్ టౌన్‌షిప్ వినాయకుని వద్ద నిర్వహించిన పూజల్లో సినీనటుడు శివారెడ్డి, పంచవటి కాలనీ వినాయకుని వద్ద జరిగిన పూజల్లో బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పి. కార్తిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుప్పాలగూడలోని గణేష్ పూజలో మణికొండ మున్సిపల్ నాయకులు



నెక్నాంపూర్ వినాయక పూజలో కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి తదితరులు



నార్సింగిలో గణేష్ పూజలో మున్సిపల్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ తదితరులు



అలకాపూర్ టౌన్‌షిప్ గణేష్ పూజలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సినీనటుడు శివారెడ్డి తదితరులు



మణికొండలోని గణపతి పూజలోవైస్ చైర్మన్ తదితరులు



నార్సింగి వినాయక పూజాలో కౌన్సిలర్ ఉషారాణి, మహిళలు



కిస్మత్‌పూర్ శ్రీకృష్ణ కాలనీలోని గణేష్ పూజల్లో నాయకులు

నేతాజీ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

అత్తాపూర్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేతాజీ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సాంగ్ తెలంగాణ ప్రాంత కార్య నిర్వాహక నాయకులు కాచం రమేష్, మహిపాల్ రెడ్డి, కొమురయ్య, మల్లారెడ్డి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, గౌతమ్, సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉత్సవాలు



శంషాబాద్: పట్టణంలోని వివేకానంద కాలనీలో ఏర్పాటు చేసిన ప్రకృతి వరసిద్ది వినాయకుడి వద్ద ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రముఖ్ కాశం రమేష్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్‌రావు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హిందు వికాస్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు దేవిరెడ్డి రఘునాథ్ రెడ్డి వారికి స్వాగతం పలికి సన్మానం చేసి వినాయక ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా నవదుర్గా వేషధారణ, కోలాటాలు, బతకమ్మలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అన్నప్రసాదం అందజేశారు.

స్వచ్ఛతహీ సేవ పోస్టర్ ఆవిష్కరణ

మణికొండ: ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు మున్సిపాలిటీలలో నిర్వహించే స్వచ్ఛతహీ సేవ పోస్టర్‌ను నార్సింగి మున్సిపల్ చైర్పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పక్షం రోజుల పాటు జరిగే స్వచ్ఛత కార్యక్రమంలో మున్సిపాలిటీని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యాలు బాగుంటాయని, రోడ్లపై ఎక్కడా చెత్త లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ నరసింహారాజు, శానిటేషన్ ఇంచార్జి లచ్చిరాం, మహిళా సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, P. SHAILAJA (as per SSC Certificate) D/o P. VENKATANNA GOUD, R/o: 22-85/107/129, CSK Villas, Villa no 129, Rallaguda Village, Shamshabad Mandal, R.R. DIST. T.G., hereby that my name after my marriage with GOWRAM CHAKRADHAR GOUD was changed as Mrs. GOWRAM SHAILAJA GOUD. Hence both names are one and same. Further future records purpose.



కర్టన్‌రైజర్ ఫర్ స్వచ్ఛ హీ సేవ-2024

బండ్లగూడ: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నటువంటి స్వచ్ఛ భారత్ మెసిన్‌లో భాగంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు కర్టన్ రైజర్ ఫర్ స్వచ్ఛ హీ సేవ-2024 కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్ లాంచ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మంజులత, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

గండిపేట డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రియాంక



మణికొండ: గండిపేట మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన జంగయ్య బదిలీపై సరూర్‌నగర్ మండలానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో శంకర్‌పల్లి మండలంలో పనిచేస్తున్న ప్రియాంకను నియమించారు. ఆమె శుక్రవారం గండిపేట తహసీల్దార్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తాం

అత్తాపూర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ డివిజన్‌కి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముఖేష్ అప్పారెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇంచార్జీ కార్తీక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖేష్ అప్పారెడ్డి మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని, కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. అలాగే అత్తాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ నూతన అధ్యక్షుడు పదవి ముఖేష్ అప్పారెడ్డిని నియమించాలని డివిజన్ నాయకులు పార్టీ ఇంచార్జీ కార్తీక్ రెడ్డిని కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు జి.బాబురావు ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శాంతినగర్ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో 20 వేల సభ్యత్వమే లక్ష్యంగా పని చేయాలని ఆయన సూచించారు. రంగారెడ్డి జిల్లా సభ్యత్వ ఇన్‌చార్జి మొండ్రా కొమురయ్య, జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీధర్, మక్తల్ అసెంబ్లీ ఇన్‌చార్జి బొక్క బాల్‌రెడ్డి, సత్యనారాయణ ముదిరాజ్, పి.సందీప్ ముదిరాజ్, వనితా రెడ్డి, కీర్తి పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి

బండ్లగూడ: గత వారం రోజులుగా కురిసిన వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేయించాలని మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు మహేష్‌యాదవ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు రోడ్లు పూర్తిగా గోతులమయంగా మారాయని, దీంతో ప్రజలు, వాహనాదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే మరమ్మత్తులు చేయించి సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరామని, త్వరలోనే సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మహాలింగంగౌడ్, నాయకులు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాల్, వైస్ ప్రెసిడెంట్ సాంబశివగౌడ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో మెజిస్టిక్-2024 ప్రారంభం



మణికొండ: గండిపేటలో మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఎంజీఐటీ- ఐఎస్‌టీఈ, ఇన్సిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం మెజిస్టిక్ - 2024ను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. చంద్రమోహన్ రెడ్డి వివిధ విభాగాల అధిపతులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, గౌరవ అతిథిగా సెవెన్ ఎస్ టెక్నాలజీస్ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ పి. చంద్రోశేఖర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థులు సమస్యల పరిష్కారానికి మెషిన్ లెర్నింగ్, డెటా అనలిటిక్స్ సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. మేకిన్ ఇండియాలో భాగంగా విద్యార్థులు పరిశ్రమ అవసరాలను తీర్చే నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ఏఐఎంఎల్ మన ప్రపంచాన్ని ఎంతగా మార్చిందో పలు పరిశ్రమలలో వాటి వాడకాన్ని వివరించారు. సోషల్ మీడియా అనేది ఓ సవాల్ అని దానికి దూరంగా ఉండాలన్నారు. ఇ కల్టివేషన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్‌రెడ్డి, మెజిస్టిక్-2024 కన్వీనర్ ప్రొఫెసర్ మాధవ రెడ్డి, కో-కన్వీనర్ బాలరాజు, అధ్యాపకులు డాక్టర్ సుబ్బరామయ్య స్టూడెంట్ కోఆర్డినేటర్‌లు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మణికొండ: విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగించే పనులను చేపడుతున్నందున శనివారం పలు కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మణికొండ ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 1 నుంచి 13 వరకు, కేపీఆర్ కాలనీ, పోచమ్మ కాలనీ, మణికొండ గార్డన్ కాలనీ, సెక్రటేరియట్ కాలనీ, ఆదిత్య ఫోర్ట్ విల్లాస్, చింతచెట్టు ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఫ్రెండ్స్ కాలనీ, హుడాకాలనీలో ఉదయం 10గంటల నుంచి 11.30 గంటల వరకు, జనచైతన్యకాలనీ, పంచవటి కాలనీలలో ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, క్యూ కాలనీ, పెంటయ్యనగర్, కేఎస్‌ఆర్ హిల్స్, డైమండ్ హిల్స్, వినాయక్‌నగర్ కాలనీ, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 14నుంచి 22 వరకు, ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 22నుంచి 30వరకు మధ్యాహ్నం 1గంట నుంచి 3గంటల వరకు, గ్రీన్‌స్పేస్, ఏజీఎల్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాంతాలలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ ఉండదని ఆయన వివరించారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతల్లో ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు, చింతల్‌మేట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు, బాసిత్ బాబానగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11.30 గంటల నుంచి 12 గంటల వరకు, ఫహాడీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 గంటల నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బండ్లగూడ: 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా పీబీఈఎల్ సిటీలోని జేఎస్‌ఎస్‌ఆర్‌యూఎంలోని ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం జేఎస్‌ఎస్‌ఆర్‌యూఎంలోని పరిసరాలను పరిశీలించి నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయించారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ నయీమ్, ఆర్‌పి జయలక్ష్మి, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

రోగాలను దరిజేరనివ్వొద్దు

మణికొండ: 'ఫ్రైడే-డ్రైడే'లో భాగంగా 4వ వార్డు హుడాకాలనీ, భాగ్యలక్ష్మి కాలనీలో ప్రజలకు దోమల వ్యాప్తి, రోగాల గురించి శుక్రవారం మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ అవగాహన కల్పించారు. నీటి నిలువలు, అపరిశుభ్రతను తొలగింప చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలు, మారుతున్న వాతావరణ పరిస్థితులతో ఎక్కువ మంది రోగాల భారిన పడుతున్నారని, వాటికి ప్రధాన కారణం దోమల వ్యాప్తి అని వాటిని నివారించి రోగాలను దరిచేరనివ్వకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇంచార్జి సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

రాజేంద్రనగర్: కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా మార్కిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి రాజేంద్రనగర్ మండల పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఎం పార్టీ మండల కార్యదర్శి జీఎం.కురుమయ్య మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి మృతి ప్రజలకు తీరని లోటని అన్నారు. సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి ఎస్ఎఫ్ఐ నాయకుడిగా జెఎన్‌ఏయూ యూనివర్సిటీలో జరిగిన ఎన్నికల్లో సుమారు మూడు పర్యాయాలు గెలిచారన్నారు. పార్లమెంటు, రాజ్యసభ సభ్యుడుగా పని చేయడంతో పాటు సీపీఎం పార్టీ నాయకుడిగా ఎదిగారన్నారు. అనారోగ్యంతో ఆయన మృతి చెందడం తీరని లోటన్నారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు ఎస్.జంగయ్య, పార్టీ నాయకులు ఎం .బాలస్వామి, వెంకటస్వామి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అత్తాపూర్: డివైడర్‌ను ఢీకొని తలకు తీవ్ర గాయాలైన మెకానిక్ రఫీయుద్దీన్ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నో- నెంబర్ ప్రాంతానికి చెందిన రఫీయుద్దీన్(37) అత్తాపూర్ మూసి పరివాహక ప్రాంతంలో ఉన్న ఓ లారీ మెకానిక్ గ్యారేజ్‌లో గత కొంతకాలంగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 10న నీలోఫర్ ఆసుపత్రిలో అతని భార్య డెలవరీ అయ్యింది. ఉదయం 6 గంటలకు నీలోఫర్ ఆసుపత్రికి వెళ్లి భార్యను చూసి వస్తుండగా పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే-136 పిల్లర్ నెంబర్ ప్రాంతంలో ఉన్న డివైడర్‌ను ద్విచక్రవాహనంపై వెళ్తున్న రఫీయుద్దీన్ ఢీకొన్నాడు. ఈ ఘటనలో తలకు తీవ్రంగా గాయాలుకాగా, ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.





సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230